క్లుప్తంగా

సైబర్‌ దాడులపై ఆన్‌లైన్‌ సదస్సు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాలలో శనివారం ఎంపవర్‌మెంట్‌ అండ్‌ ఉమెన్‌ గ్రీవియన్స్‌ జేఎన్‌టీయూకే, కాకినాడ, డిజిటల్‌ మానిటరింగ్‌ సెల్‌(డీఎంసీ), జేఎన్‌టీయూకే సహకారంతో మహిళలపై సైబర్‌ దాడులు, సైబర్‌ మోసాలను ఎదుర్కోవడం అనే అంశంపై ఆన్‌లైన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డిజిటల్‌ మానిటరింగ్‌ సెల్‌ ఇన్‌చార్జి, ప్రొఫెసర్‌ ఏఎస్‌ఎన్‌ చక్రవర్తి మాట్లాడుతూ ఆన్‌లైన్‌ చాటింగ్‌ విషయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఆన్‌లైన్‌ లైంగిక వేధింపులు, హింస, బెదిరింపులు, హత్యలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.హరినాథరెడ్డి, కళాశాల ఉమెన్‌ గ్రీవియన్స్‌, సహేలీ గరల్స్‌ క్లబ్‌ విభాగపు ఎగ్జిక్యూటివ్‌ మెంబర్స్‌, కోఆర్డినేటర్స్‌, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూలవిరాట్‌, ధ్వజస్తంభాలతో నగరోత్సవం



తిరువూరు: తిరువూరులో పునర్నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో పునఃప్రతిష్ఠించనున్న మూలవిరాట్‌లను, ధ్వజస్తంభాన్ని శనివారం పట్టణంలో ఊరేగించారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన ఆలయంలో ఆదివారం ఉదయం 9.15 గంటలకు విగ్రహాలను, ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ తెలిపింది. నగరోత్సవ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు సోమవరపు సత్యనారాయణ, కొల్లిపర సుబ్బారావు, కంచర్ల ముత్యప్రసాద్‌, గుడిమెట్ల చిన వెంకటేశ్వర్లు, అనుమోలు ముత్తారావు, గజ్జల సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ వ్యాధిపై అవగాహన సదస్సు



జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ క్యాన్సర్‌ దినోత్సవం సందర్భంగా స్థానిక నిమ్రా వైద్యశాలలో రోగులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. వైద్యశాల హౌస్‌ సర్జన్‌లు క్యాన్సర్‌ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై స్కిట్‌, ప్లకార్డుల ద్వారా రోగులకు అవగాహన కల్పించారు. వైద్యశాల సూపరింటెండెంట్‌ శ్యామలదేవి, ప్రొఫెసర్‌ వినయ్‌ బాబు, రీసెర్చ్‌ కోఆర్డినేటర్‌ మహబూబ్‌ వలి, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సత్తార్‌ఖాన్‌ క్యాన్సర్‌ వ్యాధిపై సందేశం ఇచ్చారు. వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్‌ నివారణ

తిరువూరు: క్యాన్సర్‌ వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తిస్తే నయం చేయవచ్చని వైద్యుని పుణురాలు సత్యతేజ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్‌ నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం తిరువూరు వాహినీ ఇంజినీరింగ్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాన్సర్‌ వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోజుల తరబడి నయం కాని కురుపులు, పుండ్లను గుర్తిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని, ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ వ్యాధిని గుర్తించి అవసరమైన చికిత్స చేయవచ్చని సత్యతేజ తెలిపారు. క్యాన్సర్‌ చికిత్సకు అందుబాటులో ఉన్న వైద్యసేవల గురించి వివరించారు. గైనకాలజిస్టు మధుకీర్తి మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులలో క్యాన్సర్‌ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల కరస్పాండెంటు నాగేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ కృష్ణప్రసాద్‌ పాల్గొన్నారు.

పథకాల ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలి

ముసునూరు: కుల, మత, వర్ణ, వర్గ, వయోభేదం లేకుండా, అర్హులందరికీ మేలు చేస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టేలా కృషి చేయాలని, మండల సచివాలయాల కన్వీనర్‌, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్‌ సూచించారు. ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామ పార్టీ అధ్యక్షుడు కంబాల రాంబాబు అధ్యక్షతన గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు యనమదల రాజాప్రసాద్‌, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్‌ వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయ కన్వీనర్లు కోన కృపావరం, సొంగా సరళ, చెల్లుబోయిన శివ, పార్టీ నేతలు దావులూరి నాని, బొబ్బా చెంచారావు, బేతపూడి నాగేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హుడికీ అందించటమే లక్ష్యంగా వలంటీరు వ్యవస్థతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను నియమించినట్టు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. స్థానిక ఏఎంసీ గోదాము వద్ద మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఏ రాష్ట్రంలో అమలు కానటువంటి వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి 50 గృహాలకు ఒక వలంటీర్‌ ద్వారా సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ సేవలు అందించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వలంటీర్లతో పాటు ఇద్దరు గృహసారథులను, సచివాలయ కన్వీనర్లను నియమించామని చెప్పారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులైన వారు పథకాలు అందని పక్షంలో వారికి సంక్షేమ పథకాలు అందించటానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్‌ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ శీలం నాగనర్సిరెడ్డి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, కేడీసీసీబీ డైరెక్టర్‌ రాణి, మాజీ వైస్‌ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, సర్పంచ్‌ సాధుపాటి నాగమల్లేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలరావు, ఏఎంసీ డైరెక్టర్‌ రెడ్డి శేషగిరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్‌, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ క్రికెట్‌ పోటీల్లో త్రిష ప్రతిభ



మ్యాన్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌ ట్రోఫీతో త్రిష పూజిత

మైలవరం: జాతీయ స్థాయిలో యూనివర్సిటీ మహిళా క్రికెట్‌ పోటీలలో మైలవరం డాక్టర్‌ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని త్రిష పూజిత అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఇళ్ల రవి తెలిపారు. మైలవరంలోని ఎల్‌హెచ్‌ఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రవి మాట్లాడుతూ మైసూర్‌ జేఎస్‌ఎస్‌ యూనివర్సిటీలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంతర విశ్వ విద్యాలయాల పోటీలో తమ కళాశాల విద్యార్థిని త్రిష పూజిత కేరళ కన్నూర్‌ యూనివర్సిటీపై 70 పరుగులు, యూనివర్సిటీ ఆఫ్‌ మైసూర్‌పై 62 పరుగులు చేయడమే కాక బౌలింగ్‌ చేసి ఒక వికెట్‌ తీసిందని, అంతేకాకుండా అద్భుతమైన రనౌట్‌ చేసి ఆల్‌ రౌండ్‌ ప్రతిభతో ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌గా ఎన్నిక అయిందన్నారు. కళాశాల పీడీ మన్నే స్వామి మాట్లాడుతూ మూడరోజు ఆంధ్ర యూనివర్సిటీపై జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా దిగిన త్రిష 22 ఓవర్లు ఆడి ఒంటరి పోరాటంతో 57 పరుగులు చేసినా సహచర ప్లేయర్లు అందరూ కలిసి కేవలం 17 పరుగులు మాత్రమే చేయటం వలన కృష్ణా యూనివర్సిటీ సెమీఫైనల్లో ఓటమి పాలైందన్నారు. త్రిష ప్రతిభతోనే కృష్ణా యూనివర్సిటీ జట్టు సెమీఫైనల్స్‌ దాకా వెళ్లగలిగిందని, ఇది తమ కళాశాలకు గర్వకారణమన్నారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన త్రిష పూజితను కళాశాల, యూనివర్సిటీ అధికారులు అభినందించారు.

టెక్నికల్‌ ఫెస్ట్‌తో సాంకేతిక పరిజ్ఞానం



కేతనకొండ ఆర్కే కళాశాలలో సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ రామకృష్ణయ్య

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): టెక్నికల్‌ ఫెస్ట్‌ కార్యక్రమాలతో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం అలవడుతుందని ఆర్కే కళాశాల ప్రిన్సిపాల్‌ కె.రామకృష్ణయ్య అన్నారు. ఈసీఈ, ఐటీఈ, ఐఎస్‌ఎఫ్‌ ఫారం ఆధ్వర్యంలో శనివారం టెక్నికల్‌ ఫెస్ట్‌ అజూర 2కె 23 నిర్వహించారు. యూనివర్సిటీ స్థాయిలో జరిగే ఈవెంట్‌ ఆర్కే కళాశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాలలో ఐటీఈ స్టూడెంట్‌ ఫారం ఏర్పాటుచేసి ఫెస్ట్‌ నిర్వహించినట్లు ఈసీఐ హెచ్‌ఓడీ రాజేంద్రప్రసాద్‌ తెలిపారు. విద్యార్థులు వివిధ రకాల ఆవిష్కరణలు ప్రజెంట్‌ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

నేడు పెనుగొలనులో ప్రభుత్వ భవనాల ప్రారంభం



పెనుగొలనులో నేడు ప్రారంభించనున్న ప్రభుత్వ భవనాలు

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. తిరువూరు శాసనసభ్యుడు కె.రక్షణనిధి చేతుల మీదుగా ఉదయం 10 గంటలకు 1, 2 గ్రామ సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్‌ హెల్త్‌ సెంటర్లను ప్రారంభిస్తున్నారన్నారు. గ్రామంలో రూ.80 లక్షలతో రెండు సచివాలయ భవనాలు, 2వ సచివాలయం పరిధిలో రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.7.50 లక్షలతో వెల్నెస్‌ సెంటర్‌ నిర్మాణం పూర్తి చేశారు. ఈ కార్యక్రమాలకు మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు.

పట్టణ పీహెచ్‌సీలకు శాశ్వత భవనాలు

ఎమ్మార్‌ అప్పారావు కాలనీలో చురుగ్గా నిర్మాణ పనులు



ఎమ్మార్‌ అప్పారావు కాలనీలో నిర్మిస్తున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులు

నూజివీడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా పురపాలక సంఘం పరిధిలోని శివారు కాలనీ ప్రజలు దూరంగా ఉన్న ఏరియా ఆసుపత్రులకు వెళ్లడం ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో వారికి సమీపంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. అక్కడ 10 పడకలతో కూడిన శాశ్వత భవనాలను నిర్మిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు కృషితో నూజివీడు పట్టణంలో రెండు వైఎస్సార్‌ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.80 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. వాటిలో ఒకటి పట్టణంలోని కోనేరుపేటలో, రెండోది ఎమ్మార్‌ అప్పారావు కాలనీలో నిర్మిస్తున్నారు. కోనేరుపేటలో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 10 వేల మందికి పైగా జనాభా ఉన్న ఎమ్మార్‌ అప్పారావు కాలనీలో నాలుగు నెలల క్రితం చేపట్టిన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పట్టణ ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలివి...

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 10 పడకల సౌకర్యంతో పాటు ఫార్మసీ, ఔట్‌ పేషెంట్‌ గదులు, రెండు శస్త్రచికిత్స గదులు, లాబొరేటరీ, రోగుల సహాయకులకు విశ్రాంతి గదులు, వైద్యుల గది ఉంటాయి. అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



జి.కొండూరు: మండల పరిధిలోని చెవుటూరు గ్రామ శివారులోని 30వ నంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్‌ఐ ధర్మరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై చొక్కా కూడా లేకపోవడంతో మతిస్థిమితం లేక రహదారిపై తిరుగుతుండగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జూపూడి గ్రామ సర్పంచి కాకి దేవమాత అన్నారు. జూపూడి శివారు కిలేశపురం ఎస్టీ ఏరియాలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వైస్‌ ఎంపీపీ బాణావత్‌ నాగబాలమ్మతో కలసి ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలను గ్రామ కమిటీల ద్వారా పర్యవేక్షించాలని ఐక్యవేదిక అధ్యక్షుడు రవీంద్రనాథ్‌ కోరారు. భారత రాజ్యాంగం, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. గౌరవాధ్యక్షుడు కె.ధర్మరాజు గ్రామ కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

20 లోపు పంటలు ఈకేవైసీ చేయాలి

తిరువూరు: ఈ నెల 20లోపు దాళ్వాలో సాగుచేసే పంటల వివరాలను ఈకేవైసీ చేయించుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ రైతులకు సూచించారు. ఈ-క్రాప్‌ యాప్‌లో నమోదు చేస్తేనే పంటలకు ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర లభిస్తుందని, ధాన్యం విక్రయించడానికి, పంటల బీమా సదుపాయం పొందడానికి, పీఎం కిసాన్‌ యోజన పథకం ద్వారా ప్రయోజనాలకు, ఎరువులు, పురుగుమందులు రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్బీకేలలో వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

ఆగిరిపల్లి: వాహనచోదకులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎన్‌.చంటిబాబు అన్నారు. నో యాక్సిడెంట్‌ డేలో భాగంగా శనివారం వాహనదారులు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. లైసెన్సులు వెంట ఉంచుకోవాలని, హెల్మెట్‌ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ అందజేత

నూజివీడు: మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక ఎమ్మార్‌ అప్పారావు కాలనీకి చెందిన డయాలసిస్‌ రోగి దోనేపూడి లక్ష్మికి ఒకటో నంబరు సచివాలయం వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ ఈశ్వర్‌ శనివారం విజయవాడ వెళ్లి పింఛన్‌ రూ.10 వేలు అందజేశారు. లక్ష్మికి ప్రభుత్వం నుంచి ఈ నెల పింఛన్‌ మంజూరైంది.

గడప గడపలో విశేష ఆదరణ

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు



వల్లమానులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌ అప్పారావు

ఆగిరిపల్లి: సీఎం జగన్‌ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమానులో మూడో రోజు శనివారం సాయంత్రం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 750 మంది లబ్ధిదారులను కలిసి, వారికి అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసిన సీఎం జగన్‌కు ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. ప్రజలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ పల్లగాని నరసింహారావు, ఉప సర్పంచ్‌ నల్లిబోయిన రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు రావిమేకల సత్యనారాయణ, ఎంపీపీ అనూష ఇసాక్‌, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు జేవీఆర్‌, నాయకులు కుప్పాల నాగరాజు, రెడ్డి రామకృష్ణ, మాజీ సర్పంచి జలసూత్రం కృష్ణమూర్తి, రెడ్డి రాజు, అధికారులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల ప్రణాళిక తప్పనిసరిగా రాయాలి



దుందిరాలపాడు ఎలిమెంటరీ పాఠశాలలో బోధన తీరు పరిశీలిస్తున్న ఎంఈఓ సోమశేఖర్‌

దుందిరాలపాడు(గంపలగూడెం): ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యాంశాల గురించి ముందుగా లెసన్‌ ప్లాన్‌ తప్పని సరిగా తయారుచేయాలని ఎంఈఓ బి.సోమశేఖర్‌నాయక్‌ తెలిపారు. మండలంలోని దుందిరాలపాడు ఎలిమెంటరీ పాఠశాల(హెచ్‌డబ్ల్యూ)లో ఆయన శనివారం వార్షిక తనిఖీ చేశారు. అసెంబ్లీ సమయానికే వెళ్లి పాఠశాల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా బయోమెట్రిక్‌ హాజరువేయాల్సి ఉందన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. తరగతి గదికి వెళ్లి ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మధ్యాహ్నం విద్యార్థులకు అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దను పరిశీలించారు. వంట ఏజెన్సీ మహిళలు తప్పనిసరిగా మెనూ పాటిస్తూ శుచి, శుభ్రంగా ఆహార పదార్థాలను వండి విద్యార్థులకు అందజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు షేక్‌ అహ్మద్‌ సాహెబ్‌, సీఆర్పీ అచ్చారావు పాల్గొన్నారు.

కూనపరాజుపర్వలో డాక్టర్‌ వైఎస్సార్‌ పొలంబడి

రెడ్డిగూడెం: మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అర్‌.సురేష్‌ ఆధ్వర్యంలో డాక్టర్‌ వైఎస్సార్‌ పొలంబడి కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా రైతులు, అధికారులు మొక్కజొన్న పొలం పరిసరాలను పరిశీలించి శత్రు పురుగులు, కత్తెర పురుగులు, మొవ్వ పురుగులు, మిత్ర పురుగులు, సాలీడు, తూనీగలు, అక్షింతల పురుగులను గుర్తించారు. మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. నష్టపరిమితి స్థాయి కన్నా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు, మొవ్వ పురుగు ఎక్కువ ఆశించినట్లుగా గుర్తించి స్పినోటోరమ్‌ 160 మి.లీ లేదా ఇమామెక్టిన్‌ బెంజోట్‌ 100 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులతో బృంద విన్యాసం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ మాతంగి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్‌ తోటకూర రవిబాబు, మాజీ సర్పంచ్‌ బాబూరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు దివ్య, ఝాన్సీ, పవన్‌ పాల్గొన్నారు.

కాట్రేనిపాడులో తల్లీకూతుళ్ల హత్య



అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన తల్లి, కూతురు

ముసునూరు: తల్లి, కూతురు హత్యకు గురైన ఘటన శనివారం రాత్రి వెలుగు చూసింది. ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడులో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రేనిపాడుకు చెందిన సొంగా ఏసు మరియమ్మ ఐదేళ్ల క్రితం భర్తతో విడిపోయింది. మీర్జాపురం గ్రామానికి చెందిన దేవరపల్లి రవితో ఆమె వివాహేతర సంబంధం ఏర్పరచుకుని గ్రామంలో నివాసం ఉంటోంది. ఈ నేపథ్యంలో శనివారం రోజంతా ఆమె ఇంటి తలుపులు తీయకపోవడాన్ని గమనించిన స్థానికులు రాత్రి వెళ్లి చూడగా, మరియమ్మ (35), ఆమె కుమార్తె అఖిల (15) ఇంట్లో మంచంపై రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా నూజివీడు రూరల్‌ సీఐ ఆర్‌.అంకబాబు, ఎస్‌ఐ కుటుంబరావు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గడ్డ పలుగుతో ఏసు మరియమ్మను చంపి, ఆమె కుమార్తెను మెడకు టవల్‌ బిగించి చంపినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. వివాహేతర సంబంధం నెరపుతున్న వ్యక్తే ఈ ఘటనకు పాల్పడి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దేవరపల్లి రవి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌ దేవ్‌ శర్మ, నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌ కుమార్‌ గౌడ్‌ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు.

వరి సాగులో తెగుళ్ల నివారణ చర్యలు

సీనియర్‌ శాస్త్రవేత్త గిరిజారాణి

పుట్రేల(విస్సన్నపేట): వరిసాగులో తెగుళ్ల నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాలని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ ఎం.గిరిజారాణి అన్నారు. మండలంలోని పుట్రేల గ్రామంలో వరి పొలాలను శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ఆర్‌పి 126 రకం నాటిన పొలాల్లో మొక్కలు చనిపోవటం గమనించామని, నివారణకు పొలంలో నీరు మార్చి జింక్‌ ఎకరానికి 100 గ్రాముల చొప్పున ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. ఎలిపురుగులు, ఉల్లికోడు ఉన్న పొలాల్లో కార్బోఫ్యూరాన్‌ 3జి గుళికలు ఎకరానికి 10 కిలోలు చల్లాలని దీంతో కాండం తొలుచు పురుగు నివారణ జరుగుతుందన్నారు. బూస్టర్‌ డోస్‌గా 25 కేజీల యూరియా, 25 కేజీల పొటాష్‌ ఎకరానికి చల్లడం ద్వారా మొక్కలు చనిపోవటం నివారించవచ్చని శాస్త్రవేత్తలు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్‌ శాస్త్రవేత్తలు పి.వెంకటసుబ్బయ్య, టి.శైలజారాణి, ఏడీఏ మోనిషా, జిల్లా సలహామండలి చైర్మన్‌ దొర్నాల దామోదరరెడ్డి, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల ఏవోలు రాజ్యలక్ష్మి, ఆర్‌.సురేష్‌ పాల్గొన్నారు.

బలివే మహోత్సవాలను విజయవంతం చేద్దాం

డెప్యూటీ కలెక్టర్‌ రజనీకుమారి



బలివే మహోత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌ కుమార్‌ గౌడ్‌

ముసునూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బలివే గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని డెప్యూటీ కలెక్టర్‌ రజనీకుమారి పిలుపునిచ్చారు. బలివే రామలింగేశ్వరాలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్‌ అధికారి, తహసీల్దార్‌ దాసరి సుధ అధ్యక్షతన బలివే మహోత్సవాల ఏర్పాట్లపై రెండో సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రజనీకుమారి మాట్లాడుతూ లక్షలాదిగా భక్తులు హాజరయ్యే బలివే మహోత్సవాల నిర్వహణను విజయవంతం చేయాలన్నారు. భక్తుల స్నానాలకు, దైవదర్శనానికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 10వ తేదీకల్లా తమ్మిలేరు లోపలకు నీరు విడుదల చేయాలని ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్‌ సరఫరా చేయాలన్నారు. వైద్య శిబిరం ఏర్పాటుచేసి, 108, అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారి ప్రతాప్‌, కరీముల్లాలను ఆదేశించారు. అగ్నిమాపకదళ శకటాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ఉత్సవ ప్రాంగణ పరిసరాల్లో మద్యం విక్రయాలు నిషేధమన్నారు. నూజివీడు, ఏలూరు వైపు నుంచి ఉత్సవాలకు చేరుకునే రహదారులకు పూర్తి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. డీఎస్పీ అశోక్‌ కుమార్‌ గౌడ్‌ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో సర్పంచ్‌ రావు ప్రవీణ సుధాకర్‌, నడిపల్లి సర్పంచ్‌, ఎంపీడీఓ జి.రాణి, పెదవేగి తహసీల్దార్‌ నాగరాజు, నూజివీడు సీఐ ఆర్‌. అంకబాబు, ఎస్‌ఐ కుటుంబరావు, ఆలయ ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు, పంచాయతీ రాజ్‌ ఏఈ నరసింహారావు, పెద్దలు నాగుల నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండ్లికుమారుడైన వేంకటాచలస్వామి



తిరువూరు: తిరువూరులో ఉన్న శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. వేదపండితులు ఉదయకుమారాచార్యులు, దేవయాజనం వేణుగోపాలాచార్యులు, ఎన్‌సీహెచ్‌ విఠలాచార్యులు నేతృత్వంలో వేంకటాచలస్వామికి విశేషపూజలు నిర్వహించారు. నిత్యహోమం, బలిహరణం అనంతరం పంచామృతాలతో అభిషేకించి వేంకటాచలస్వామిని పెండ్లికుమారుడిని చేశారు. ఆదివారం రాత్రి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

ఆటో బోల్తా : ఐదుగురికి తీవ్ర గాయాలు

చాట్రాయి: బైక్‌పై అతి వేగంగా, నిర్లక్ష్యంగా వెళుతున్న వ్యక్తి కారణంగా ఆటో బోల్తా పడి ఐదుగురు గాయాలపాలైన ఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన కూలీలు చాట్రాయికి కూలి పనుల నిమిత్తం వచ్చారు. పనుల అనంతరం ఇంటికి తిరిగి వెళుతుండగా ఎదురుగా వేగంగా వస్తున్న బైక్‌ని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో కూలీలంతా కిందపడిపోయారు. వారిలో ఐదుగురు కూలీలు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం చింతలపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాలరావమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి, ఆగిరిపల్లి, కనసానపల్లి గ్రామాల్లోని దుగ్గిరాల బాలరావమ్మతల్లి మాఘపూర్ణిమ తిరునాళ్లను పురస్కరించుకుని రెండో రోజు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తోటపల్లిలో రాత్రి 9 గంటలకు విద్యుత్‌ దీపాలతో అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారి ప్రభ మహోత్సవం నిర్వహించారు. ఆగిరిపల్లిలో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. మేళతాళాల మధ్య అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగించారు. కనసానపల్లిలో అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్‌ దీపాలతో 60 అడుగుల ప్రభను ఏర్పాటు చేశారు. రాత్రికి అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు.